
అగర్‌మియాగూడ రైతులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్డీవో

భూమికి భూమి ఇవ్వాల్సిందే

» ఉన్నది లాక్కుంటే ఎలా బతకాలి?

» ఇన్‌చార్జి ఆర్డీవోకి అగర్‌మియాగూడ రైతుల మొర

కందుకూరు,నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మీర్కాన్‌పేట, బేగరికంచ గ్రామాల్లో నెలకొల్పనున్న ఫ్యూచర్‌సిటీ వరకు నిర్మించనున్న రోడ్డు కోసం ప్రభుత్వం రైతుల నుంచి సేకరించే భూమికి భూమి ఇవ్వాలని అగర్‌మియాగూడ రైతులు డిమాండ్ చేశారు. గురువారం గ్రామంలో పర్యటించిన ఇన్‌చార్జి ఆర్డీవో అనంతరెడ్డికి వినతి పత్రం అందించారు. ఫ్యూచర్‌సిటీ వరకు 330ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయి పూర్తిగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉన్న ఎకరం, రెండెకరాల పట్టా భూములు లాక్కుంటే ఎలా బతకాలని మొరపెట్టుకున్నారు. పరిహారం గురించి మాట్లాడకుండా రోడ్డు సర్వే ఎలా చేస్తారని ప్రశ్నించారు.

పోలీసు బందోబస్తుతో సర్వే పనులు

కాగా అగర్‌మియాగూడ, తిమ్మాపురం, లేమూరు గ్రామాలలో పోలీసు బందోబస్తు మధ్య గురువారం సర్వే పనులు కొనసాగాయి. మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి నేతృత్వంలో కందుకూరు, మహేశ్వరం సీఐలు సీతారాం, వెంకటేశ్వర్లు పోలీసులను మోహరించారు. తహసీల్దార్ కె.గోపాల్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణానికి సర్వే పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీవో అనంతరెడ్డి పరిహారం విషయాన్ని చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ స్థాయి సర్వేర్ కృష్ణయ్య, మండల సర్వేయర్ సాయికాంత్, లేమూరు మాజీ సర్పంచ్ డిల్లీ గణేష్, రైతులు సుధాకర్‌రెడ్డి, నీరటి శ్రీకాంత్, లిక్కి జంగారెడ్డి పాల్గొన్నారు.



మంచు మనోహారం

శీతాకాలంలో ప్రకృతి అందాల వర్ణనకు పదాలు చాలవు. సెలయేటి సవ్వడులు, పక్షుల కిలకిలా రావాలు, మంచు తెరలు, చిగురుటాకులపై నీటి బిందువులు, వేకువజామున ప్రసరించే భానుడి కిరణాలు, చల్లని గాలులు, తెల్లని మబ్బుల నీలాకాశం.. ఇలా ప్రతీ ఒక్కటి ప్రకృతి ప్రేమికుల మదిని దోచేవే. ఇలాంటి ఓ అపురూప దృశ్యం హిమాయత్ నగర్‌లోని ఈసీ వాగు సమీపంలో గురువారం ఆవిష్కృతమైంది. మంచు తెరలను చీల్చుకుంటూ వస్తున్న సూర్యుని ప్రతిబింబం పారేటి వాగులో ప్రతిబింబించిన చిత్రం వర్ణనాతీతం. ఆ పక్కనే చెట్ల ఆకులపై నుంచే రాలే మంచు బిందువుల సోయగం ఎంత చూసినా తనివి తీరనిది. నుదిట సింధూరం అద్దుకుందా అన్నట్లు కనిపించే ఆకాశాన్ని మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తుంది.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి

మహిళా సమాఖ్యల పనితీరు భేష్

» ఎన్కేపల్లిలో ఒడిశా అధికారుల బృందం పర్యటన


ఎన్కేపల్లిలో మహిళా సంఘాలతో సమావేశమైన అధికారుల బృందం

మొయినాబాద్ రూరల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సంఘాల పనితీరు బాగుందని, వీటి ద్వారా అతివలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఒడిశా గ్రూప్ 1 స్థాయి అధికారుల బృందం కితాబు ఇచ్చింది. గురువారం మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో ఆ బృందం పర్యటించింది. గ్రామంలోని స్నేహపొదుపు సంఘాల పనితీరును పరిశీలించింది. ఒడిశాలో కూడా ఇలాంటి సంఘాలను ఏర్పాటు చేసేందుకు ఇక్కడ పర్యటించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీజీ ఐఆర్‌డీ అనిల్‌కుమార్, ఎంపీడీఓ సంధ్య, ఏపీఎం రవీందర్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, సీసీ రమేష్, సంఘాల సభ్యులు సంధ్య, స్రవంతి, అర్చన, సంతోష, మంజుల పాల్గొన్నారు.


ముడిమ్యాల్‌లో పర్యటిస్తున్న డీపీవో సురేశ్‌మోహన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చేవెళ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ అన్నారు. గురువారం ముడిమ్యాల్‌లో డీపీవో పర్యటించారు. గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయొద్దని, పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్తబుట్టల్లోనే వేయాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం సాధ్యమన్నారు. మురుగు కాలువల్లో వారానికి రెండుసార్లు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సిబ్బందిని ఆదేశించారు. సమగ్ర కుటుంబ సర్వేపై వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హిమబిందు, ఎంపీవో విఠలేశ్వర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాడి దండిగున్నా.. సేకరణ సున్నా!

బిల్లులు సకాలంలో చెల్లించక ప్రైవేటుకు పాలు

దోచుకుంటున్న వ్యాపారులు

తీవ్రంగా నష్టపోతున్న పాడి రైతులు

మూతపడిన ప్రభుత్వ పాల సేకరణ కేంద్రం

వృథాగా బల్క్ మిల్క్ కూలింగ్ భవనం


మూతపడిన పాల సేకరణ కేంద్రం



ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ అంటేనే పాడి, పంటలకు పెట్టింది పేరు. ఆ గ్రామంలో ఇంటికో పాడి ఆవును వ్యవసాయానికి అనుబంధంగా పెంచుకుంటారు. పాల ఉత్పత్తిలో ఈ గ్రామం ముందంజలో ఉంటుంది. అలాంటి ఈ గ్రామంలో ఏడాదిగా ప్రభుత్వ ఆధీనంలో కొనసాగే పాలసేకరణ కేంద్రం మూతపడింది. పాడి రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నామని ప్రభుత్వం డబ్బా కొట్టుకుంటుంది తప్ప క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. సర్కార్ పాలను సేకరించకుంటే ఉత్పత్తి చేసి ఏం లాభం అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

షాద్‌నగర్‌రూరల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): కిషన్ నగర్‌ను ఒకప్పుడు పిడికిర్యాల గ్రామంగా పిలువబడేది. ఈ గ్రామాన్ని మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సందర్శించారు. ఇక్కడ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యమివ్వడం చూసి గ్రామానికి కిసాన్ నగర్‌గా నామకరణం చేశారు. రానురాను ఆ పేరు కిషన్ నగర్‌గా మారింది. ఆనాటి నుంచే ఈ గ్రామంలో పాల ఉత్పత్తి అధికంగా ఉండేది. దీంతో ఇక్కడ పాల సేకరణ కేంద్రం ఏర్పాటు చేశారు. కిషన్ నగర్‌లో ఉత్పత్తి అయ్యే పాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా సేకరించేవారు. అయితే బిల్లులు

మిగతా 8వ పేజీలో...

నియామకం



జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా రాపర్తి వెంకటేష్‌గౌడ్

శంషాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ హైకోర్టు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్‌గా రాపర్తి వెంకటేష్‌గౌడ్‌ను నియమిస్తూ అడిషనల్ అడ్వకేట్ జనరల్ తెర రజనీకాంత్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన అడ్వకేట్ జనరల్ దర్శన్‌రెడ్డి, సీఎం రేవంత్, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు, టీపీసీసీ లీగల్‌సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్, కో ఆర్డినేటర్ దామోదర్‌రెడ్డికి కృతజ్ఞతలని తెలిపారు.

గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్ డే

యాచారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో స్పెషల్ శానిటేషన్‌డేను పాటించారు. గురువారం మండల కేంద్రంతో పాటు నందివనపర్తి, చింతపట్ల, కుర్మిద్ద, తాటిపర్తి, ధర్మన్నగూడ, మాల్, నల్లవెల్లి, గున్‌గల్, గడ్డమల్లాయగూడ తదితర గ్రామాలలో పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తచెదారాన్ని తొలగించారు. మురుగు కాలువలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఓహెచ్‌ఎస్‌ఆర్ వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

పూర్తయ్యేది ఇంకెన్నాళ్లకు?

అసంపూర్తిగా తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు

నత్తనడకన రహదారి విస్తరణ పనులు

అవస్థలు పడుతున్న వాహనదారులు

పట్టించుకోని అధికారులు, పాలకులు



8

మండల సాధన ఉద్యమం ఉధృతం

గట్టిప్పలపల్లిని మండలముగా

ప్రకటించాలని గ్రామస్తుల డిమాండ్

21వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష

ర్యాలీలో పాల్గొన్న మహిళలు, యువకులు



7

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి?

ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

బీమా క్లెయిమ్ కోసం చికిత్స

ఆలస్యం చేశారని ఆరోపణ

మృతురాలు కందుకూరు వాసి



7

ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర

» ప్రగతిని అడ్డుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

» ఎంపీ డాక్టర్ మల్లు రవి


విలేకరులతో మాట్లాడుతున్న మల్లు రవి

కడ్తాల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నాయకులు కుట్ర రాజకీయాలు సాగిస్తూ ప్రగతి నిరోధకంగా మారారని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసి రాజకీయంగా లబ్ధిపొందేందుకు కేటీఆర్, హరీశ్‌రావు, ఆ పార్టీ నేతలు సాగిస్తున్న ఎత్తుగడలు ప్రజలు తిప్పికొట్టాలని ఆయన పిలుపు నిచ్చారు. కడ్తాల మండలం మైసిగండి గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతి బాటన నడిపిస్తుంటే ఓర్వలేని విపక్షాలు విషం కక్కుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రభుత్వం భూసేకరణ చేయడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. ప్రగతిని అడ్డుకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. లగచర్లలో కలెక్టర్, అధికారులపై దాడి కేటీఆర్ కుట్రలో భాగమేనని మల్లు రవి ఆరోపించారు. భూసేకరణకు రైతుల అభిప్రాయం తెలుసుకోవడానికి వెళ్లిన అధికారులపై దాడి సరైంది కాదన్నారు. భూసేకరణ చేయకుండా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులు ఎలా నిర్మించారని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని పదేళ్ల పాటు బీఆర్‌ఎస్ నాయకులు దోచుకున్నారని, అధికారం పోగానే నేడు ప్రజలు, వారి బాధలు గుర్తొచ్చాయా అని ఎద్దేవా చేశారు. ఫామ్‌హౌజ్‌లో పడుకున్న విపక్ష నేత కేసీఆర్‌కు ప్రజా సమస్యలు ఎలా తెలుస్తాయని నిలదీశారు. రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు హరీశ్, కేటీఆర్‌లకు లేదన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ సిరోలిపంతూ, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, పీసీసీ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, బీచ్యానాయక్, గూడూరు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

పాదచారిని బైకిస్టు ఢీకొట్టడంతో ప్రమాదం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొత్తూర్, నవంబరు 21:(ఆంధ్రజ్యోతి) : నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని బైకిస్టు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంతో ఇద్దరూ దుర్మరణం చెందారు. ఈ ఘటన కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ సమీపంలో 44వ నెంబర్ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నర్సింహ్మారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా ఊట్కూర్ ప్రాంతానికి చెందిన రమేష్(28) శంషాబాద్ మండలం పాల్మాకుల ప్రాంతంలో ఉంటూ స్ర్కాప్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో తన బైక్‌పై స్వగ్రామానికి వెళ్తూ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి(40)ని బలంగా ఢీకొట్టడంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మాట్లాడుతున్న బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

హక్కుల పరిరక్షణకే బీసీ కమిషన్

బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ గోపిశెట్టి నిరంజన్

బీసీ కులాలు, సంఘాల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

రంగారెడ్డి అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో వెనకబడిన బలహీనవర్గాల ప్రజలు ఎంతమంది ఉన్నారో తెలిస్తే వారికి చేయూత కల్పించేందుకు ఆస్కారం ఉంటుందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. గురువారం బీసీ కమిషన్ చైర్మన్, బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా పరిధిలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులపై బహిరంగ విచారణ కార్యక్రమం నిర్వహించారు. సంచార జాతులు, ముదిరాజు, పూసల, మేదర, గంగపుత్ర, బెస్త, బీసీ హక్కుల సాధన కమిటీ, విశ్వబ్రాహ్మణ-విశ్వకర్మ, వాల్మీకిబోయ, వడ్డెర, వీరభద్రుల, రజక, కుమ్మర, దూదేకుల, కుర్మ, మేదర సంఘం ప్రతినిధులు, ఇతర సంఘాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు తెలిపారు. ఈ సందర్భంగా బీసి కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకొని వారి హక్కుల రక్షణ కోసం కృషి చేసేందుకు రాష్ట్ర బీసీ కమిషన్ బహిరంగ విచారణ నిర్వహిస్తున్నదన్నారు. ఇప్పటివరకు ఏడు విచారణలు పూర్తి కాగా, ఇది ఎనిమిదవది అని తెలిపారు. ఈనెల 26 వరకు కమిషన్ బహిరంగ విచారణలు ఆయా జిల్లాల్లో కొనసాగుతాయని చెప్పారు. బీసీలపై ఎక్కడైనా

మిగతా 7వ పేజీలో...

స్పౌజ్‌ల అక్రమ బదిలీలపై చర్యలు తీసుకున్నాం

మేడ్చల్‌ప్రతినిధి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో స్పౌజ్ పాయింట్లు, అక్రమ బదిలీలపై వస్తున్న విమర్శలపై ఎట్టకేలకు మేడ్చల్ డీఈవో విజయకుమారి నోరు విప్పారు. కొన్ని రోజులుగా ఉపాధ్యాయ సంఘాలు, మీడియాలో డీఈవో తీరుపై పెద్ద ఎత్తున విమర్శలొస్తున్న విషయం తెలిసిందే. ఈ అంశంలో ఉపాధ్యాయ సంఘాలు ధర్నాకు సైతం పిలుపునిచ్చాయి. తప్పనిసరి పరిస్థితుల్లో గురువారం డీఈవో స్పందిస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన స్పౌజ్ ట్రాన్స్‌ఫర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో 11మంది ఉపాధ్యాయులు వారి స్పౌజ్‌లకు సమీపంలో గల ఖాళీ పోస్టులను ఎంచుకోకుండా వారికి అనుకూలంగా వెబ్ కౌన్సిలింగ్‌లో స్పౌజ్ క్యాటగిరీలో వేరేచోట్ల ఖాళీ పోస్టులను ఎంచుకున్నారని డీఈఓ తెలిపారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా వారిపై చార్జెస్ ఫ్రేమ్‌చేసినట్లు తెలిపారు. చార్జెస్ ఫ్రేమ్‌పై ఇద్దరు ఉపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారని, స్టే ఎత్తివేతకు జిల్లా విద్యాశాఖ తరఫున వేకెట్ పిటిషన్ వేసినట్లు డీఈవో తెలిపారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం స్పౌజ్ నిబంధనలకు విరుద్ధంగా జరిగిన బదిలీలపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఉపాధ్యాయసంఘాలు తలపెట్టిన ధర్నాను తాత్కాలికంగా నిలిపివేశారని డీఈఓ వెల్లడించారు.

సీసీఐ సిమెంట్ నమ్మకమైంది

ఢిల్లీ మార్కెటింగ్ జీఎం అలోక్ శుక్లా

వికారాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ ఉత్పత్తి చేసే సిమెంట్ నమ్మకమైందని, ప్రైవేట్ సంస్థల వలె మోసం చేసేది కాదని ఢిల్లీ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ అలోక్ శుక్లా అన్నారు. గురువారం వికారాబాద్‌లోని హరిత రిసార్ట్‌లో సీసీఐ సిమెంట్ డీలర్, సబ్ డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో సిమెంట్ అవసరాలను తీర్చేందుకు 1965లో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ స్థాపించారన్నారు. దీనికి తాండూరులో మూడు ఆపరేటింగ్ ప్లాంట్లు ఉన్నాయన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల్లోని కొన్ని ప్రాంతాలకు, హిమాచల్‌ప్రదేశ్, అస్సాం రాష్ట్రాలకు సేవలందిస్తోందన్నారు. 1987లో కరన్‌కోట్‌లో ఇక్కడి ఫ్యాక్టరీని స్థాపించారన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం శరత్‌కుమార్, రీజినల్ మేనేజర్ ఉమేష్ కుమార్‌సింగ్, సీనియర్ మేనేజర్లు దివాకర్, శ్రీవాస్తవ, పాండే, మేనేజర్ ఆఫీసర్లు వెంకట్రాములు, రోహిత్ మిశ్రా, అసిస్టెంట్ ఆఫీసర్లు దేవరాజు, బాల్‌రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఢిల్లీ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ అలోక్ శుక్లా

పెరటి కోళ్ల పెంపకంతో లాభాలు

మేడ్చల్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గిరిజన మహిళలు పెరటి కోళ్ల పెంపకంపై శ్రద్ధ చూపాలని ఎన్‌ఆర్‌సీ డైరెక్టర్ బుధేరా అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చెర్లపల్లి ఐకార్ నేషనల్ మీట్ రీసెర్చ్ వారు గురువారం రావల్కోల్, రాజబొల్లారం గ్రామాల్లో బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ పేరిట కోడి పిల్లలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుధేరా మాట్లాడుతూ.. నాటు కోడి మాంసానికి డిమాండ్ పెరిగిందన్నారు. ఇళ్ల వద్ద పెంచే పెరటి కోడి మాంసానికి మరింత గిరాకి ఉందన్నారు. ఇళ్ల వద్ద గిరిజన మహిళలు పెరిటి కోళ్లను పెంచి ఆర్థికస్థితిని మెరుగుపర్చుకోవాలని సూచించారు. యనియల్ హస్బెండరి ఏడీ ప్రభురాజ్ మాట్లాడుతూ.. పెరటి కోడి మాంసం విక్రయం, వాటి గుడ్ల అమ్మకాలు, ధరలపై వివరించారు. రాజబొల్లారంలో 28, రావల్కోల్‌లో 20 యూనిట్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బలరామ్, బిక్షినాయక్, డాక్టర్ కురు మూర్తి, మంగ్యనాయక్ పాల్గొన్నారు.



కోళ్ల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ట్యాక్సీ, క్యాబ్‌లకు సబ్సిడీ నిలిపివేత

వికారాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ట్యాక్సీ, మోటారు క్యాబ్ సబ్సిడీలను నిలిపివేస్తున్నట్లు పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ మహేశ్వర్ గురువారం తెలిపారు. జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న టీ-ప్రైడ్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, అంగవైకల్య లబ్ధిదారులకు ట్యాక్సీ, మోటారు క్యాబ్ ఖరీదుకు అందిస్తున్న రాయితీలు నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024 డిసెంబరు 1 నుంచి ఎలాంటి వాహన రాయితీలు ఇవ్వబోం అని పేర్కొన్నారు.



మహేశ్వర్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్

ఉత్తమ ఫలితాలే లక్ష్యం



మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

తాండూరు రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. గురువారం తాండూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత విద్యా సంవత్సరంతోపాటు వచ్చే విద్యా సంవత్సరంలోనూ విద్యాప్రమాణాలు పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కలెక్టర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో 1వ తరగతి నుంచి 5వ తరగతులు, 6 నుంచి 9వ తరగతుల విద్యార్థుల్లో పఠన సామర్థ్యాలను పెంచేందుకు దృష్టిసారించామన్నారు. పాఠశాలల హెచ్ఎంలకు ఎఫ్ఎల్ఎన్‌పై శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఈ డిసెంబరు నాటికి సిలబస్ పూర్తిచేసి రివిజన్ చేపట్టాలని ఆదేశించామని తెలిపారు. ఇప్పటికే స్పెషల్ క్లాసులపై ఫోకస్ పెట్టామన్నారు. యేటికేడు టెన్త్ ఫలితాల్లో మెరుగుదల కన్పిస్తోందని డీఈవో గుర్తు చేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్ టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ర్యాగింగ్ సంస్కృతిని వీడి క్రమశిక్షణతో మెలగాలని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఘనాపూర్ మెడిసిటీ మెడికల్ కళాశాల విద్యార్థులకు ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. విద్యార్థులు జూనియర్లు, సీనియర్లు అనే తేడా ఒకరినొకరు గౌరవిస్తూ చదువుకోవాలన్నారు. విద్యార్థుల్లో ర్యాగింగ్ పట్ల చైతన్యం తీసుకొచ్చేందుకు చేపడుతున్న అవగాహనా సదస్సులు సత్ఫలితాలిస్తున్నాయని తెలిపారు. కళాశాలలో ర్యాగింగ్ చేయకుండా యాజమాన్యాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మేడ్చల్ సీఐ సత్యనారాయణ, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న స్పీకర్



పడిపూజలో మొక్కుతున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని వికారాబాద్‌లోని శివాజీనగర్ కాలనీలో సోమ నర్సింహులు గురువారం నిర్వహించారు. పూజ తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరైన స్వామి వారిని దర్శించుకున్నారు. వందలాది మంది అయ్యప్ప స్వాములు వచ్చి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కిషన్, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

మండల సాధన ఉద్యమం ఉధృతం



రిలే దీక్షలో కూర్చున్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండలంగా సాధించే వరకు ఉద్యమ పోరాటాన్ని ఆపం అని గట్టిప్పలపల్లి మండల సాధన జేఏసీ నాయకులు ప్రకటించారు. రోజురోజుకూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. గట్టిప్పలపల్లిని మండలం చేయాలనే డిమాండ్‌తో జేఏసీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారంతో 21వ రోజుకు చేరాయి. దీక్షలో జేఏసీ నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రం ఏర్పాటుకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవి శ్రద్ధతీసుకోవాలని నాయకులు కోరారు. దీక్షలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ శరత్‌చంద్ర, కార్యదర్శి ఆంజనేయులుగౌడ్, శ్యామల్‌కుమార్, శివయ్య, వినోద్‌బాబు, శ్రీను, రవి, బాలయ్య, జంగయ్య, చంద్రయ్య, రాజు, నర్సింహ, వెంకటయ్య, కృష్ణయ్య, మల్లయ్య, విజయ్, ఈదమయ్య, నారయ్య పాల్గొన్నారు.

విద్యార్థినులకు పౌష్టికాహారాన్ని అందించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్

యాలాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థినులకు పౌష్టికాహారం అందివ్వాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. గురువారం యాలాలలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. తరగతి గదులను, వంట గదిని సందర్శించారు. విద్యార్థుల భోజనాన్ని, కూరగాయలను పరిశీలించారు. సబ్‌కలెక్టర్ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నీటి వసతి సరిగ్గా లేదని, ఇతర సమస్యలు ఉన్నాయని బాలికలు చెప్పారు. అధికారి వచ్చిన సమయంలో ప్రిన్సిపాల్ లేరు. సబ్‌కలెక్టర్ వెంట తహసీల్దార్ అంజయ్య ఉన్నారు.

ఎమ్మెల్సీ కారుకు ప్రమాదం



నాయకులతో మాట్లాడుతున్న నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్ రూరల్, నవంబరు21(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి కారుకు గురువారం సాయంత్రం ప్రమాదం జరిగింది. పట్టణ శివారులోని మిలీనియం టౌన్‌షిప్ వద్ద స్కూటీ యూటర్న్ తీసుకుంటూ ఎమ్మెల్సీ కారును ఢీకొంది. ఎమ్మెల్సీ కారులో షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. గాయపడిన ద్విచక్రవాహనదారుడిని ఎమ్మెల్సీ అనుచరులు, గన్‌మెన్‌లతో ఆసుపత్రికి తరలించారు. కాగా ఎమ్మెల్సీ కారు ముందు భాగం దెబ్బతింది.

జేఎల్ పోస్టుల్లో జయకేతనం

మ్యాథమెటిక్స్‌లో జిల్లా నుంచి 11 మంది ఎంపిక



కె.రాజు పదో ర్యాంక్



సాయికుమార్ 26వ ర్యాంక్



ఎం.రాణి 29వ ర్యాంక్

వికారాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) గురువారం సాయంత్రం విడుదల చేసిన గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్ ఉద్యోగ పరీక్ష ఫలితాల్లో మ్యాథమెటిక్స్ సబ్జెక్టులో జిల్లా నుంచి 11 మంది ఎంపికయ్యారు. వికారాబాద్‌లోని మ్యాథ్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ నుంచి పరీక్ష రాసిన 32 మంది అభ్యర్థుల్లో 11మంది జేఎల్‌లుగా ఎంపికయ్యారు. ఈ అకాడమీకి చెందిన కె.రాజు రాష్ట్రస్థాయిలో పదో ర్యాంక్ సాధించారు. బి.సాయికుమార్ 26వ, ఎం.రాణి 29వ, కె.సతీష్ 30వ ర్యాంక్‌లు సాధించారు. అలాగే కె.శ్రీనివాస్, బి.మనీష, కె.సంతోష్, జి.రాజశేఖర్, వై.శ్రవణ్‌కుమార్, ఎం.వరలక్ష్మి, జి.మౌనికలు ఉత్తమ ర్యాంక్‌లతో జాబ్‌సాధించారు. ఈ అభ్యర్థులు 11 నెలలు అవిశ్రాంతంగా శ్రమించి జేఎల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని మ్యాథ్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ డైరెక్టర్ ఎస్.రత్నాకర్ తెలిపారు.

మళ్లీ తెరపైకి మనోహ టౌన్‌షిప్

- రాజీవ్ స్వగృహ ప్లాట్ల వేలం
- కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ
- మూడు రకాల ప్లాట్ల ఏర్పాటు
- ధర ఎక్కువంటూ కొనుగోలుదారుల వెనకడుగు



హైదరాబాద్ రోడ్డులోని వెంచర్‌లో అసంపూర్తిగా వదిలేసిన రాజీవ్ స్వగృహ ఇళ్లు, అసంపూర్తి నిర్మాణాలు



తాండూరులోని మనోహ టౌన్‌షిప్

తాండూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వంపై భారం మోపకుండా ఆదాయంపై దృష్టిసారించాలని డిప్యూటీ సీఎం బి.విక్రమార్క, ఈ నెల 4న హైదరాబాద్‌లో రిసోర్స్ మొబలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో సబ్ కమిటీ నివేదిక మేరకు పెండింగ్‌లో ఉన్న రాజీవ్ స్వగృహ ప్లాట్లు, నిర్మాణంలో ఉన్న ఇళ్ల స్థితిగతులను సమీక్షించి నిబంధనల మేరకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

మనోహ టౌన్‌షిప్ అభివృద్ధికి ముందడుగు?

తాండూరులోని హైదరాబాద్ రోడ్డులో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి సమీపంలో 2014లో తెలంగాణ రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో డీటీసీపీ అప్రూవ్డ్ లేవట్‌తో మనోహ టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేశారు. 2021, 2022, 2023 సంవత్సరాల్లో వాటికి ఆక్షన్ నిర్వహించారు. అప్పట్లో కొందరు ఉద్యోగులు పూర్తిగా ప్లాట్ల విలువ, నిర్మాణానికి డబ్బులు చెల్లించగా మరికొందరు కొంత మొత్తం కట్టి విరమించుకున్నారు. మొత్తానికి డబ్బులు కట్టిన వారి పేరిట ప్లాట్ కేటాయించినా పూర్తిగా కట్టని వారికి ప్లాట్/ఇల్లు హ్యాండోవర్ చేయలేదు. 2023 డిసెంబరులో ప్రభుత్వం మారింది. దీంతో అప్పటి వరకు ప్లాట్లలో ఎంతోకొంత పనులు జరిగినా కొత్తగా వచ్చిన ప్రభుత్వంలో పనులు నిలిచాయి. దీంతో ఇళ్ల, ప్లాట్ల కేటాయింపు నిలిచిపోయింది. మారిన పరిస్థితుల నేపథ్యంలో మరోసారి ప్లాట్లకు మరోసారి వేలాన్ని నిర్వహించనున్నారు. యాలాల మండలం కోకట్‌లో సర్వే నంబరు 52లో మూడు రకాల ప్లాట్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 14ఓపెన్ ప్లాట్లు, సెమీ ఫినిష్ 54 ప్లాట్లు ఉన్నాయి. త్వరలో వీటిని వేలం వేసి విక్రయించాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ఇళ్లు కట్టించి అప్పగించడమా? లేక ఓపెన్ ప్లాట్లనే కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ చేయించడమా? అనే అంశంలో సందిగ్ధంలో ఉన్నారు.

ప్లాట్ రకం	వైశాల్యం(స్క్వేర్ మీటర్లు)
క్లాసిక్	209.05
ఇంట్రాసిటీ	167.18
బేసిక్	125.54
సివిక్స్	88.66

ధరపైనే తకరారు

డీటీసీపీ అప్రూవ్డ్ లేవుట్లు హైదరాబాద్ రోడ్డు మార్గంలో బైపాస్ రోడ్డుకు సమీపంలో ఉండటం, బస్టాండ్, రైల్వే స్టేషన్లకు 4కి.మీ లోపే ఉన్నాయి. అయితే ఆక్షన్ కోసం ఏర్పాటు చేసేత సదస్సుల్లో ధర ఎక్కువగా ఉందని కొందరు వాదిస్తున్నారు. గతంలో ప్రభుత్వం గజానికి రూ.10వేలను నిర్ణయించింది. అయితే కొన్ని ప్లాట్లకు బిడ్డింగే కాలేదు. ఎక్కడా లేని విధంగా రాజీవ్ స్వగృహ ప్లాట్లకు ధరను నిర్ణయించాలని కొనాలనుకున్న వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్లాట్లు కొన్న వారికి నీటి, రోడ్డు, డ్రైయినేజి వ్యవస్థలు కల్పించక ఇబ్బందులు పడుతున్నారు.

వక్ఫ్‌బోర్డు కోరల్లోకి అనంతగిరి

- పవిత్ర క్షేత్రంలో అక్రమంగా మదర్సా
- మూసీ ప్రక్షాళన హైదరాబాద్‌లో కాదు.. మొదట ఆ నది పుట్టిన అనంతగిరిలో చేయాలి
- ఆలయ పరిరక్షణకు హిందువులు నడుంకట్టాలి
- హిందూ జనశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు లలిత్‌కుమార్



మాట్లాడుతున్న లలిత్‌కుమార్

వికారాబాద్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తమిళనాడు తిరుచ్చందూర్, శబరిమల, ముంబై సిద్ధివినాయక ఆలయాల మాదిరిగా అనంతగిరి అనంత పద్మనాభస్వామి ఆలయం కూడా వక్ఫ్ బోర్డులోకి తీసుకునే ప్రమాదం ఉందని హిందూ జనశక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు లలిత్‌కుమార్ అన్నారు. గురువారం అనంతగిరికి వచ్చిన ఆయన అనంత పద్మనాభస్వామి కార్తీక మాసోత్సవాల్లో భాగంగా అనంతగిరి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అఖండ భజన భజనలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే వక్ఫ్ బోర్డుకు దేశంలో 9లక్షల ఎకరాల భూమి ఉందని, అయినా ఇంకా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులను వక్ఫ్‌కు అప్పగిస్తున్నారని, లేదంటే కబ్జా చేస్తున్నారని మండిపడ్డారు. పవిత్ర అనంతగిరి క్షేత్రంలో అక్రమంగా మదర్సా నడుపుతుంటే అధికారులు, పాలకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అనంతగిరి పరిరక్షణసమితి చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలకు సహకరించాల్సిన అధికారులు అడ్డుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. మూసీ నదిగా పిలువబడే ముచుకుందా నదిని హైదరాబాద్‌లో ప్రక్షాళన చేయడం కాదని, మొదట మూసీ పుట్టిన ఆలయ పుష్కరిణిని బాగుచేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. హిందువులు మొద్దునిద్ర వీడి ఆలయాన్ని రక్షించుకునేందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. అనంతగిరి కొండలు మొత్తం అనంత పద్మనాభుడివే అయినా పద్మనాభస్వామి పేరిట గుంట భూమి లేకపోవడం విచిత్రంగా ఉందన్నారు. అధికారులు భూములను వక్ఫ్‌కు కేటాయించడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హిందూ జనశక్తి అధ్యక్షుడు శ్రీనివాస్, ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు నర్సిములు తదితరులు పాల్గొన్నారు.



వడ్లను పరిశీలిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ మాధవరెడ్డి

కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కందుకూరు, నవంబరు21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్లలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని శంషాబాద్ సర్కిల్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.మాధవరెడ్డి అన్నారు. గురువారం కందుకూరులోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. సన్న రకం ఎ-గ్రేడ్ వడ్లకు క్వింటాలుకు 2,320 మద్దతు ధర అలాగే 500 బోనస్ ఇస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే సాధారణ రకానికి 2,300 ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 580బస్తాల ధాన్యం కొన్నామని అధికారికి సీఈఓ యాదగిరెడ్డి తెలిపారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి ప్రభుత్వాలు కృషి చేయాలి

పరిగి రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి ముకుంద నాగేశ్వర్ అన్నారు. పరిగిలో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. పండుగల సాయన్న ముదిరాజ్, క్రిష్ణస్వామి ముదిరాజ్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి ముదిరాజ్ సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దేశమోని మాణిక్యం ముదిరాజ్, మండల అధ్యక్షుడు అనంతయ్య ముదిరాజ్, నాయకులు జనార్దన్ ముదిరాజ్, జేపీ నారాయణ ముదిరాజ్, నరేష్ ముదిరాజ్, సత్యయ్య ముదిరాజ్, రమేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

శామీర్‌పేట: మత్స్యకారులు ప్రభుత్వ చేయూతను అందిపుచ్చుకుని ఆర్థికాభివృద్ధిని సాధించాలని మత్స్య పారిశ్రామిక సంఘం శామీర్‌పేట మండల అధ్యక్షుడు కరకపట్ల రాము అన్నారు. ఉప్పరపల్లిలో మత్స్య కార్మికుల దినోత్సవాన్ని నిర్వహించారు. సంఘం జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నందున వారిని బీసీ-ఏ కేటగిరిలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకరయ్య, రవీందర్, రామచందర్ ముదిరాజ్, నాయకులు కుంట రమేష్, రాజు, బాలకృష్ణ, ఆంజనేయులు, యాదగిరి, శ్రీను, గణేష్, శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



శామీర్‌పేట: సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న రాము ముదిరాజ్

న్యాయం కోసం మృతుడి కుటుంబీకుల ఆందోళన



రోడ్డుపై బైఠాయించిన మల్లేష్ బంధువులు

కేశంపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): లేమామిడి శివారులో గత శనివారం ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి మృతిచెందిన కేశంపేట మల్లేష్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ గురువారం లేమామిడిలో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేశారు. లేమామిడి- కేశంపేట రోడ్డుపై బైఠాయించారు. మల్లేష్ మరణంతో అతడి కుటుంబం రోడ్డున పడిందన్నారు. వారికి న్యాయంచేయాలన్నారు. ప్రమాదానికి కారణం అయిన నందాచారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళన విషయం తెలుసుకున్న సీఐ నరహరి, ఎస్ఐ రాజ్‌కుమార్ అక్కడికి చేరుకుని వారితో కారులతో మాట్లాడారు. ఘటనపై విచారణ జరిపి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. నందాచారి సైతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. తాత్కాలికంగా మల్లేశ్ దహన సంస్కారాలకు రూ.30వేలు ఇప్పించారు. దీంతో మృతుడి కుటుంబీకులు, బంధువులు ఆందోళన విరమించారు.



ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

కనుల పండువగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): యాలాలలో గురువారం ఆంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభన ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. మూడు రోజులుగా ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు కొనసాగుతున్నాయి. మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. పూజల్లో మాజీ ఎంపీపీ కె.పురుషోత్తంరావు, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సంధ్యారాణి, అక్బర్‌బాబ,రవీందర్, బుగ్గప్ప, అశోక్, శివయ్య, యాదప్ప పాల్గొన్నారు. ఈ పూజల నేపథ్యంలో బొడ్రాయికి మహిళలు బోనాల నేవేద్యం సమర్పించారు.

హక్కుల పరిరక్షణకే బీసీ కమిషన్

(5వ పేజీ తరువాయి)

దాడులు జరిగితే బీసీ కమిషన్ చర్యలు తీసుకోవడానికి వెనుకాడదని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వేలో కోటి 15 లక్షల పైచిలుకు కుటుంబాలను రాష్ట్రవ్యాప్తంగా గుర్తించడం జరిగిందని, ఇందులో 87 వేల మంది ఎన్యూమరేటర్లు ఇప్పటివరకు ప్రతీ ఇంటికి వెళ్లి సమాచారం సేకరిస్తున్నారని, సమగ్ర కుటుంబ సర్వే వివరాలు పూర్తిగా పబ్లిక్ డొమైన్‌లో పొందుపర్చడం జరుగుతుందని చెప్పారు. ఈ సర్వేపై అపోహ పడొద్దని సూచించారు. ఇప్పటివరకు 65 నుంచి 70 శాతం సర్వే పూర్తయిందన్నారు. రంగారెడ్డి జిల్లాలో 79 శాతం, మేడ్చల్ మల్కాజ్‌గిరిలో 65 శాతం, వికారాబాద్‌లో 74 శాతం సర్వే పూర్తి చేయడంపై ఆయన అభినందించారు. రెండేళ్ల తొమ్మిది నెలల కాల పరిమితిలో బీసీలకు న్యాయం చేసేందుకు కమిషన్ కృషి చేస్తుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో 44, మేడ్చల్ జిల్లాలో 19, వికారాబాద్ జిల్లాలో 9 మొత్త 72 వినతులు, సలహాలు, సూచనలు, అఫిడవిట్ రూపంలో కమిషన్‌కు సమర్పించారని, వాటన్నిటినీ క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ సతీష్‌కుమార్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, మేడ్చల్ అదనపు విజయేందర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కేశురాం, మేడ్చల్ బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిర పాల్గొన్నారు.



వినతి పత్రాలు అందజేస్తున్న కుల సంఘాల నాయకులు

ఎవరేమన్నారంటే..

చట్టసభలో అవకాశం కల్పించాలని మేడ్చల్ జిల్లా కుమ్మరి సంఘం నాయకులు దయానంద్, చంద్రయ్య కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. కుల వృత్తి అంతరిస్తుందన్నారు. భవిష్యత్‌లో మ్యూజియంలో మట్టి పాత్రలు చూడాల్సిన పరిస్థితి రావచ్చన్నారు. కుమ్మరులను ఒండ్రు మట్టి తీయనివ్వడం లేదని తెలపగా, ఒండ్రు మట్టి తీసుకునేందుకు జీవో 140 ఉందని చైర్మన్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా కుమ్మర సంఘం నాయకులు జీవన్ మాట్లాడుతూ బీసీ-బీలో ఉన్న కుమ్మరులను బీసీ -ఏలో చేర్చాలని కోరారు. రంగారెడ్డి జిల్లా కుమ్మర సంఘం నాయకులు దయానంద్ మాట్లాడుతూ కుమ్మరులు చేస్తున్న వృత్తిపై శిక్షణ ఇచ్చి సబ్సిడీపై రుణం ఇవ్వాలని కోరారు. కుల వృత్తిపై స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కిందకు తీసుకురావాలని, కుమ్మరులు ఎదుర్కొంటున్న సమస్యలపై విచారణ చేపట్టి ఈనెల 28 వరకు నివేదిక అందజేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను ఆదేశించారు.

- పూసల కులస్తులు దుర్భర జీవితాలను గడుపుతూ దయనీయ స్థితిలో ఉన్నారని సంఘం జిల్లా నాయకులు సదానందం కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. పూసల కులస్తులను సంచార జాతుల్లో చేర్చాలని కోరారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కుమ్మోవత్ కులానికి చెందిన టి. సోనారావు తమ కులాన్ని గుర్తించాలని కోరారు. చిట్టెపు కులానికి చెందిన జంగారెడ్డి చిట్టెపు కులాన్ని గుర్తించాలన్నారు. ఐదు కులాలుగా ఉన్న కమ్మరి, వడ్రంగి, శిలా శిల్పి, స్వర్ణకార, కంచర కులాలను కలిపి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలుగా గుర్తించాలని సంఘం రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా నాయకులు పులిగిళ్ల శ్రీనివాసచారి, వీరాచారి, వెంకటచారి కోరారు.
- కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి. సుధాకర్, నాయకుడు యాదయ్య మాట్లాడుతూ బెల్టుషాపులు లేకుండా చూడాలని, వైన్స్‌షాపుల్లో సొసైటీలకు రిజర్వేషన్ కల్పించాలని, 29 జీవోను రద్దు చేయాలని చైర్మన్‌ను కోరారు. సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మాట్లాడుతూ బీసీ-ఎ గ్రూపులో ఉన్న తమ కులాల్లో, సంచార జాతులు లేని కులాలు ఉన్నాయని వారిని బీసీ-ఎ గ్రూపు నుంచి తొలగించాలని కమిషన్‌ను కోరారు. ఎస్సీ, ఎస్టీలో నుంచి తమ కులాన్ని తొలగించి బీసీలో చేర్చినా అన్యాయమే జరుగుతుందని వాల్మీకి బోయ సంఘం నాయకుడు లక్ష్మణ్ తెలిపారు. కొండలు, గుట్టల్లో రాళ్లపై హక్కు వడ్డెర కులస్తులకు కల్పించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు విజ్ఞేశ్వర్, యాదయ్య కమిషన్‌ను కోరారు. 50 ఏళ్లు నిండిన క్షౌర వృత్తి దారులకు పింఛన్ ఇవ్వాలని సంఘం నాయకుడు మల్లేష్ కోరారు. ఆరెకటిక సంఘం కులాన్ని గుర్తించాలని సంఘం జిల్లా నాయకురాలు సునీత అన్నారు. బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి ఉప్పరులను చేర్చాలని సంఘం జిల్లా నాయకులు కృష్ణసాగర్, సతీష్ సాగర్ కోరారు.

వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి?

ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

మన్సూరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రిలో దారుణం చోటుచేసుకుంది. గుండె జబ్బు చికిత్సకు వెళ్లిన ఓ మహిళ వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతిచెందిందంటూ బంధువులు ఆస్పత్రి వద్ద ధర్నా చేశారు. వివరాల్లోకి వెళితే.. కందుకూరు మురళినగర్‌కు చెందిన రత్లావత్ కోటి(54) రెండు నెలల నుంచి గుండెనొప్పి వస్తోందని నగరంలోని ఓ ఆస్పత్రికి వెళ్లగా వైద్యులు ఆపరేషన్ చేయాలన్నారు. అనంతరం వారు తమకు సమీపంలో ఉందని బుధవారం ఉదయం 7గంటలకు కామినేని ఆస్పత్రికి వచ్చి అడ్మిటయ్యారు. కోటి చికిత్సపొందుతూ అదేరోజు రాత్రి 10గంటలకు మృతిచెందింది. దీంతో ఆగ్రహించిన మృతురాలి భర్త చందు, కుమారులు శ్రీకాంత్, శ్రీను, బంధువులు ఆస్పత్రి వద్ద ధర్నాకు దిగారు. చికిత్స చేస్తామని చెప్పిన వైద్యులు వెంటనే చికిత్స అందించాల్సి ఉండగా రోగి చికిత్సకు 10లక్షల రూపాయల బీమా క్లెయిమ్ అయ్యే వరకు చూసి డబ్బు వచ్చాక రోగి చనిపోయిందని చెప్పారన్నారు. నవ్వుతూ వెళ్లిన తమ తల్లి వైద్యుల నిర్లక్ష్యంతో మృతిచెందిందని కొడుకులు రోదించారు. రాత్రి 9గంటలకు చనిపోయిందని చెప్పి రిపోర్టులో 10గంటలకు అని రాశారని అనుమానం వ్యక్తం చేశారు. విషయం తెలిసి పోలీసులు ఆస్పత్రికి వచ్చి వారితో మాట్లాడి ఆందోళన సద్దుమణిగేలా చేశారు.


మధుయాష్కీని సన్మానిస్తున్న అనంత రెడ్డి

మధుయాష్కీని కలిసిన మాజీ వైస్ ఎంపీపీ అనంత రెడ్డి

ఆమనగల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పీసీసీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్‌ను గురువారం ఆమనగల్లు మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈమేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ సూచించినట్లు అనంతరెడ్డి తెలిపారు.

- అసంపూర్తిగా తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు
- నత్తనడకన రహదారి విస్తరణ పనులు
- ప్రయాణికుల ఇక్కట్లు.. పట్టని అధికారులు, పాలకులు

ఇంకెన్నాళ్లు?


కంకర వేసి వదిలేసిన తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు

మహేశ్వరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తుమ్మలూరు మీదుగా మహేశ్వరం, శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారికి ప్రతీరోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగడంతో పది నెలలుగా ఈ రోడ్డు ద్వారా ప్రయాణం చేసే ప్రతీ ఒక్కరు పడుతున్న ఇబ్బందులు అంతా ఇంతా కాదు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రోడ్డు విస్తరణ పనుల కోసం 5 కిలోమీటర్లకు గాను రూ.14కోట్లు విడుదలయ్యాయి. ప్రారంభంలో పనుల వేగవంతం చేసిన కాంట్రాక్టర్ ఆ తర్వాత నిర్లక్ష్యం చేశాడు. దాంతో తుమ్మలూరు-మహేశ్వరం ప్రజలే కాకుండా రెండు జాతీయ రహదారులైన శ్రీశైలం, బెంగళూరు జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డు పనులు నత్తనడకన సాగడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కంకర రాళ్ల వల్ల వాహనాలు పాడవుతున్నాయని, దుమ్ముతో నానా ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. బెంగళూరు జాతీయ రహదారిపై నుంచి వెళ్లే వాహనాలు శ్రీశైలం జాతీయ రహదారికి చేరుకోవాలంటే తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు మార్గం తప్పనిసరి. అయితే, రోడ్డు విస్తరణ పనులు పది నెలలుగా నత్తనడకన సాగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెరుగుతుందా? అని వాహనదారులు, ప్రయాణికులు చర్చించుకుంటున్నారు. తుమ్మలూరు రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కోరుతూ రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్‌ను గ్రామానికి చెందిన యువత కలిసి మొరపెట్టుకున్నారు.

పది నెలలుగా సాగని పనులు



గత పది నెలలుగా పనులు ముందుకు సాగడం లేదు. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. బీఆర్ఎస్ హయాంలో రూ.14కోట్లు విడుదల చేసినప్పటికీ కాంట్రాక్టర్ పనులను వేగవంతం చేయడం లేదు. కంకర కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. పనులు ప్రారంభించాలని గ్రామ యువకులు ధర్నాలు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వీలైనంత త్వరగా రోడ్డు పనులను పూర్తిచేసి ప్రయాణికులు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

- కె. శ్రీహరి, తుమ్మలూరు మాజీ ఉపసర్పంచ్

రైతుల సంక్షేమమే లక్ష్యం

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- దామరిగిద్ద, సర్దార్‌నగర్‌లో పత్తి, వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


షాబాద్ : సర్దార్‌నగర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల/షాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. గురువారం చేవెళ్ల మండల పరిధిలోని దామరగిద్దలో ఉన్న శ్రీనివాస కాటన్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని అమ్ముకోవాలని సూచించారు. దళారులకు పత్తి అమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, టీజీపీసీబీ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల మార్కెట్ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, ఏవో శంకర్‌లాల్, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లావణ్య శంకర్, డైరెక్టర్లు మల్లేష్, నరేందర్, రాములు, జనార్దన్, కాంగ్రెస్ చేవెళ్ల మండలాధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి మహేందర్, సీసీఐ మేనేజర్ రాజు, పత్తి మిల్లు కంపెనీ చైర్మన్ రమేశ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు. అలాగే షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్ మార్కెట్ యార్డులో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. త్వరలోనే పూర్తిస్థాయిలో రైతు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. డీసీఎమ్మెస్ చైర్మన్ కృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పీసీబీ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, డీసీఎమ్మెస్ బిజినెస్ మేనేజర్ వెంకట్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, రవీందర్ నాయక్, ఆంజనేయులుగౌడ్, మల్లేష్, సుభాష్‌రెడ్డి, నర్సింలు, జంగయ్య, మల్లేష్, అధికారులు సురేశ్‌బాబు, సుజాత, లిఖిత, మనోహర్‌రెడ్డి ఉన్నారు.

హైదరాబాద్-శ్రీశైలం రోడ్డును ఆరు లేన్లుగా విస్తరించాలి : కసిరెడ్డి

ఆమనగల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఈమేరకు గురువారం ప్రధాని మోదీ, కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి గడ్కరీ, సీఎం రేవంత్‌రెడ్డిలకు వినతిపత్రాలు పంపారు. జాతీయ రహదారిపై వాహనాల రద్దీ రోజురోజుకూ పెరిగిపోయిందని, వేల వాహనాలు, లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ఈ రహదారిని విస్తరణ చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, అనేక మంది మృత్యువాత పడడంతో పాటు వందల మంది క్షతగాత్రులయ్యారని పేర్కొన్నారు. కల్వకుర్తి సమీపంలోని కొట్రగేటు నుంచి కొల్లాపూర్‌లోని సోమశిల, కరివెన మీదుగా ఏపీలోని నంద్యాల వరకు 167కే జాతీయ రహదారిని నిర్మిస్తున్నందున హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని వీలైనంత త్వరగా ఆరు లేన్లుగా విస్తరించాల్సిన అవసరం ఉందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ రహదారిని తుక్కుగూడ నుంచి విస్తరిస్తేనే శ్రీశైలం-తిరుపతి జాతీయ రహదారులు అనుసంధానమై వాహనాల రద్దీని తట్టుకోగలుగుతుందని, ఈ విషయాన్ని ఇటీవల సీఎంకు కూడా వివరించినట్లు కసిరెడ్డి పేర్కొన్నారు.

కాలేజీ భవన నిర్మాణానికి దాతల సాయం అభినందనీయం


విరాళం అందజేస్తున్న నర్సింహులు

షాద్‌నగర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేందుకు దాతలు విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి సమక్షంలో తుమ్మల నర్సింహులు రూ.51వేలు కళాశాల నిర్మాణం కోసం విరాళంగా నగదును అందజేశారు. మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, యాదయ్య యాదవ్ శ్రీనివాస్ యాదవ్, బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, విశ్వం, తదితరులు పాల్గొన్నారు.

'చెకుముకి' పోటీలతో ప్రతిభ వెలికితీత

- మండల విద్యాధికారులు
- ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత


కందుకూరు : ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంఈవో నర్సింహ

ఆమనగల్లు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతిభను గుర్తించేందుకు చెకుముకి పోటీలు దోహదపడుతాయని మండల విద్యాధికారి పాండు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఎంఈవో పాండు పోటీలను ప్రారంభించారు. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంగ్లీష్ మీడియం నుంచి ఆమనగల్లు అరబిందో స్కూల్ విద్యార్థులు సాదియా, చరణ్, వంశీ, తెలుగు మీడియం నుంచి స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలు రోజ, సాదియా, అఫ్రాలు మొదటి స్థానంలో నిలిచారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈనెల28న జరిగే జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈవో పాండు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

కేశంపేట : మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. కేశంపేట, కొత్తపేట జడ్పీహెచ్ఎస్‌లో ఎజాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు నిర్వహించారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో కొత్తపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల్లో.. తొమ్మిదిరేకులలోని రామకృష్ణ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సీఆర్‌పీ రామకృష్ణ, కాంప్లెక్స్ హెచ్ఎం విద్యావతి, తదితరులున్నారు.

చౌదరిగూడ : శాస్త్ర విజ్ఞానం అభివృద్ధి చెందుతున్నా నేటికీ మూఢనమ్మకాలు సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయని జీహెచ్ఎం గోపినాథ్ అన్నారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, గురుకుల పాఠశాల విద్యార్థులకు ఉన్నత పాఠశాల ఆవరణలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. జిల్లా స్థాయి పోటీలు 28న నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక కొందుర్గు మండల బాధ్యులు ప్రేమ్‌సాగర్, శ్రీదేవి, నర్సింలు తెలిపారు. చౌదరిగూడ జీహెచ్ఎం సునీత, శంకర్‌గౌడ్, కుషాల్, శ్రీనివాస్, ఉపాధ్యాయులున్నారు.

కందుకూరు : విద్యార్థులు విద్యారంగంలో రాణిస్తూనే.. చెకుముకి సైన్స్ ప్రతిభ పరీక్షల్లో పాల్గొనాలని మండల విద్యాధికారి ఎ.నర్సింహ అన్నారు. మండలంలోని 16 పాఠశాలలకు చెందిన 8, 9, 10 తరగతి విద్యార్థులకు టీఎస్‌యూటీఎఫ్, జేవీవీ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నోబుల్ స్కూల్‌లో మండల స్థాయి సైన్స్ సంబురాలను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆయన ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు రవి, కందుకూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అంజయ్య, కందుకూరు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయ సంఘం నేతలు బుగ్గరాములు, నోబుల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.కొండల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి


మొయినాబాద్ రూరల్ : చిలుకూరు పెద్దచెరువులో చేప పిల్లలను వదులుతున్న అధికారులు, మత్స్యకారులు

మొయినాబాద్ రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలంగాణ ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తెలిపారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మత్స్యకార విభాగం చైర్మన్ మహేందర్ ముదిరాజ్ సాయికుమార్‌ను గురువారం నగరంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో భిక్షపతి, రమేష్, శ్రీశైలం, మల్లేష్, గణేష్, నవీన్, ప్రవీన్ తదితరులు ఉన్నారు. కాగా, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో చేప పిల్లలను వదిలే కార్యక్రమాన్ని చేపట్టారు. మత్స్యకారులతో పాటు అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మత్స్యకారుల ఐక్యతను చాటుకుందాం

కొత్తూర్ : మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను సమష్టిగా ఎదుర్కొంటూ ఐక్యతను చాటుకోవాలని గుడూరు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు గుండు సురేష్ పిలుపునిచ్చారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గుడూర్‌లో మత్స్యకారులు సంఘం జెండాను ఆవిష్కరించారు. మత్స్య సహకార సంఘం నాయకులు నారాయణ, గట్టు చంద్రయ్య, నర్సింహులు, శ్రీశైలం, చంద్రయ్య, భిక్షపతి, గోపాల్, శేఖర్, కావలి కృష్ణ, లోకేష్, మహేష్, శివరాజ్, జగన్, కుమార్, సిద్ధూ, రాజేష్, రమేష్, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.


కొత్తూర్ : గుడూర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న మత్స్యకారులు

మైసమ్మ ఆలయ అభివృద్ధికి తోడ్పాటు


షాద్‌నగర్ : విరాళం అందిస్తున్న అశోక్‌యాదవ్

కడ్తాల్, నవంబరు 21(ఆంధ్ర జ్యోతి): మైసిగండి మైసమ్మ దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వ పరంగా తోడ్పాటునందిస్తానని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. మండలంలోని మైసిగండి మైసమ్మ ఆలయాన్ని గురువారం రవి సందర్శించారు. ఆలయ ఫౌండర్‌ట్రస్టీ సిరోలిపంతూ, నిర్వాహకుడు రామావత్ భాస్కర్, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో రవిని సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, పీసీసీ కార్యదర్శి మధుసూధన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, నాయకులున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్ : పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల యాదవకాలనీ బంగారు మైసమ్మ ఆలయ నిర్మాణానికి షాద్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్ యువ నాయకులు నందారం అశోక్‌యాదవ్ రూ.3.69 లక్షల విరాళం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కాలనీ యాదవులు అశోక్‌ను అభినందించారు. రఘునాథ్‌యాదవ్, సంతోష్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, గోపాల్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

పాడి దండిగున్నా.. సేకరణ సున్నా!

(5వ పేజీ తరువాయి)


చెట్ల పొదల్లో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్

సకాలంలో చెల్లించకపోవడం, అప్పట్లో లీటరు పాల ధర తక్కువగా ఇవ్వడంతో పాడి రైతులు ప్రైవేట్ వైపు మొగ్గు చూపారు. పాలకు ప్రస్తుతం ప్రభుత్వం ధర పెంచినా బిల్లులు సకాలంలో చెల్లించడం లేదని ప్రైవేట్ డెయిరీలకే విక్రయిస్తున్నారు. 15 రోజులకోమారు చెల్లించే బిల్లులు 45 రోజులైనా పెండింగ్‌లోనే ఉంటున్నాయి. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రానికి ఎవరూ పాలు పోయకపోవడంతో దానిని మూసి వేశారు. ప్రస్తుతం కిషన్‌నగర్‌లో నాలుగు ప్రైవేట్ పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ప్రైవేట్ వ్యక్తులు రైతుల నుంచి పాలను రూ.30 నుంచి రూ.32 తక్కువ ధరకు సేకరించి షాద్‌నగర్‌లోని పాల శీతలీకరణ కేంద్రంలో ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం లీటరు పాలకు ఫ్యాట్‌ను బట్టి రూ.39 నుంచి రూ. 46 ధర చెల్లిస్తుంది. ఇలా పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కిషన్‌నగర్ గ్రామం నుంచి ప్రతీరోజు సుమారు మూడు వందల మంది పాడి రైతులు నాలుగు వేల లీటర్ల వరకు పాలను కేంద్రాలకు పోస్తారు.

శిథిలావస్థలో బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్

కిషన్‌నగర్ గ్రామంలో పాల ఉత్పత్తి ఎక్కువగా ఉండటంతో ఇక్కడ కూలింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రత్యేక నిధులతో భవనాన్ని కూడా నిర్మించారు. బీఎంసీ యంత్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు మిల్క్ ట్యాంక్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. పాల సేకరణ తగ్గిపోవడంత బల్క్ మిల్క్ కూలింగ్ యంత్రాలను కొందుర్గుకు తరలించారు. అప్పటి నుంచి భవనం వృథాగా మారి శిథిలావస్థకు చేరింది. సకాలంలో బిల్లులు చెల్లిస్తే ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రానికే పాలుపోస్తామని రైతులు పేర్కొంటున్నారు.

సకాలంలో బిల్లులు చెలిస్తే పాలు పోస్తాం



ప్రైవేట్‌కు పాలు పోసి తీవ్రంగా నష్టపోతున్నాం. ఏడాది కాలంగా ఇదే పరిస్థితి ఉంది. 15 రోజులకు ఒక బిల్లు ఇస్తే సెంటర్‌లోనే పాలు పోస్తాం. ప్రభుత్వం పాడి రైతుల గురించి ఆలోచించాలి.

- ప్రశాంత్‌రెడ్డి, పాడి రైతు, కిషన్‌నగర్

తప్పని పరిస్థితిలోనే..



చేసిన కష్టం వృథాగా పోతుంది. మేము పాల ఉత్పత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. అయినా తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేట్‌కు పాలు పోసి నష్టపోతున్నాం. బిల్లు సకాలంలో చెల్లించి నష్టం జరగకుండా చూడాలి.

- రాంచంద్రయ్య, పాడి రైతు, కిషన్‌నగర్

సంక్షిప్తంగా

● **కడ్తాల్** : మండల కేంద్రంలో కిరణ్‌గౌడ్ ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి పథకాన్ని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతలతో కలిసి పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్ , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **కేశంపేట** : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల పరిషత్ అధికారి రవిచంద్రకుమార్‌రెడ్డి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో చెత్తాచెదారం తొలిగించి కలుపు మొక్కలను తీసివేయించారు.

● **చేవెళ్ల** : విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో చదువుకుని ఉన్నతులుగా ఎదగాలని చేవెళ్ల మండల విద్యాధికారి పురందాస్ తెలిపారు. ఊరెళ్ల ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు కెరియర్ గైడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

● **చేవెళ్ల** : మహిళలు గ్రామ సంఘాల్లో చేరి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల మండల ఏపీఎం శోభరాణి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో మహిళా సమాఖ్య అధికారులు సంఘాల్లో లేని మహిళలను గుర్తించి బొట్టుపెట్టి సంఘాల్లో చేరాలని ఆహ్వానించారు. ఇప్పటి వరకు 192 మందిని గుర్తించి సంఘాల్లో చేర్పించడం జరిగిందన్నారు. సీసీలు, సభ్యులు తదితరులున్నారు.

● **యాచారం** : నెల రోజుల వ్యవధిలో మురుగునీటి సమస్య పరిష్కరించనున్నట్లు ఎంపీవో శ్రీలత, పంచాయతీ రాజ్ ఏఈ వంశీలు తెలిపారు. నానక్‌నగర్ గ్రామాన్ని వారు సందర్శించి మురుగునీటిని గ్రామానికి దూరంగా తరలించడం కోసం చర్యలు తీసుకుంటామని వారు గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

● **కడ్తాల్** : 2023 మేలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలని టీఎస్ యూటీఎఫ్ కడ్తాల మండల నాయకులు కోరారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఎంఈవో సత్యనారాయణకు యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.గోపాల్‌నాయక్, మండల అధ్యక్షుడు సి.జంగయ్య ఆధ్వర్యంలో సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షుడు ఎ.మల్లయ్య, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ విజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

● **కందుకూరు** : పర్యావరణ పరిరక్షణ బాధ్యత మనందరిపైన ఉందని వావ్(వెల్ బీయింగ్ ఔటాఫ్ వేస్ట్) ఉద్యమ ప్రచారకర్త రామకృష్ణ అన్నారు. నేదునూరు ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాత నోటుబుక్స్, ప్లాస్టిక్ పేపర్స్‌ను బయట వేయకుండా, తమ సంస్థకిస్తే రీసైక్లింగ్ చేసి కొత్త పెన్ను, పెన్సిల్స్ ఇస్తామన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదం.. వ్యక్తికి తీవ్ర గాయాలు

మాడ్గుల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బైక్‌తో రోడ్డు క్రాస్ చేస్తుండగా కారు ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని అన్నేబోయినిపల్లి గేటు సమీపాన చోటుచేసుకొంది. గ్రామస్తుల కథనం మేరకు.. అన్నేబోయినిపల్లికి చెందిన దార మల్లయ్య(50) కుమారుడికి కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. ఈమేరకు అతడిని హైదరాబాద్‌కు డ్యూటీలో చేర్పించేందుకు నల్గొండ జిల్లా మాల్ వద్ద బైక్ పై దింపేందుకు వెళ్లాడు. అనంతరం మాల్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా మల్లయ్య అన్నేబోయినిపల్లి గేటు దాటుతున్న క్రమంలో నాగార్జున సాగర్ వైపు నుంచి వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొంది. దాంతో మల్లయ్య కాలు విరిగి, తలకు బలమైన గాయాలయ్యాయి. గ్రామస్తులు మాల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి.. అనంతరం హైదరాబాద్‌కు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. దార మల్లయ్య ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి


కేశంపేట : సమావేశంలో మాట్లాడుతున్న విష్ణువర్ధన్ రెడ్డి

కేశంపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించి బీజేపీ సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి(పీవీఆర్) పిలుపునిచ్చారు. గురువారం కేశంపేట మండల కేంద్రంలోని శారదా గార్డెన్‌లో పార్టీ మండలాధ్యక్షుడు రొల్లు రఘురాములుగౌడ్ ఆధ్వర్యంలో పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు అభియాన్‌పై సమీక్షా, సమవేశం నిర్వహించారు. పీవీఆర్‌తో పాటు అందె బాబయ్య హాజరయ్యారు. పీవీఆర్ మాట్లాడుతూ ప్రతీ పోలింగ్ బూత్‌లో మెజార్టీ సభ్యత్వాలు నమోదు చేయించాలని సూచించారు. నాయకులు మోటే శ్రీనివాస్, కరెడ్ల నరేందర్ రెడ్డి, మహేష్, ఐలయ్య, పాలాది శ్రీనివాస్, విఠల్ గౌడ్, నర్సింహ, తిరుపతి, కుమార్‌గుప్తా, గోపాల్‌రెడ్డి, మల్లేష్, నర్సింగ్, అశోక్ రెడ్డి, వెంకటేశ్వర్ జీ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి


చౌదరిగూడ : స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి పిలుపునిచ్చారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆర్యసమాజ్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండలాధ్యక్షుడు కురుమయ్య అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు మండల ఇన్‌చార్జి వెంకటేష్ గుప్తా, రాజు, బీమయ్య, గొల్లరాజు, శ్రీశైలం, విఠల్, సాయిరాం, హరీష్, వెంకటేష్, రవీందర్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

చలో ఇందిరాపార్క్‌ను జయప్రదం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

యాచారం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 26న మంగళవారం నగరంలోని ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు చందునాయక్ కోరారు. ఈమేరకు ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను మంతన్‌గౌరెల్లిలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేసి అధికారంలోకి వచ్చాయి తప్ప.. వారి గోడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటయ్య, లక్ష్మి, రమేష్, రాజు, మణెమ్మ, లాలు, రామకోటి, జంగయ్య తదితరులున్నారు.

నిరుపేదలకు అండగా ఐక్యత ఫౌండేషన్


కంటి అద్దాలు అందజేస్తున్న కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీరాములు

ఆమనగల్లు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలో ఐక్యత ఫౌండేషన్ నిరుపేదలకు అండగా నిలుస్తుందని ఫౌండేషన్ సభ్యులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రచ్చ శ్రీరాములు అన్నారు. పట్టణంలోని శ్రీ లక్ష్మీగార్డెన్స్‌లో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెన్నై శంకరన్ నేత్రాలయం సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా కంటి వైద్యశిబిరం గురువారం మూడోరోజు కొనసాగింది. కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లు, కడ్తాల్, కల్వకుర్తి, వెల్దండ, మాడ్గుల, తలకొండపల్లి మండలాల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 850 మంది శిబిరానికి హాజరయ్యారు. 640 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 290 మందికి కంటి అద్దాలు అందజేశారు. 36 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఫౌండేషన్ సభ్యులు నరేందర్ గౌడ్, కొండల్‌రెడ్డి, మల్లయ్య, కొండల్ యాదవ్, గణేశ్, రమేశ్ నాయక్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

మొయినాబాద్, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): సీపీఐ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి పిలుపునిచ్చారు. గురువారం మొయినాబాద్ మండల పరిధిలోని పెద్దమంగళవారంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీపీఐ ఆవిర్భావ వేడుకలను అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, బోనాల ప్రభాకర్, నాగిరెడ్డి దర్శన్, హన్మంతు, ఎండీ జంహగీర్, కె.రత్నం, వెంకటయ్య, ఎండీ జలీల్, సత్తయ్యగౌడ్, తదితరులు ఉన్నారు.

ఎస్సీ వసతి గృహాన్ని తనిఖీ చేసిన డీటీ


భోజనాన్ని పరిశీలిస్తున్న డీటీ బాలకృష్ణారెడ్డి

శంకర్‌పల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల వసతి గృహం ప్రాంగణంలో మున్సిపల్‌కు సంబంధించిన వాహనాలను నిలపకూడదని శంకర్‌పల్లి డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. శంకర్‌పల్లి ఎస్సీ బాలుర వసతిగృహాన్ని గురువారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి బాగోగులు తెలుసుకున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉందని, మున్సిపల్ వాహనాలు నిత్యం వసతిగృహ ప్రాంగణంలో నిలపడంతో దోమలు ప్రబలుతున్నాయని విద్యార్థులు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన కమిషనర్ శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్య లేకుండా చూడాలని కోరారు. వసతిగృహం పైన ప్రమాదకరంగా ఉన్న చెట్టును పరిశీలించి తొలగించాలని వార్డెన్‌ను ఆదేశించారు. వంట గదిలోకి వెళ్లి ఆహారాన్ని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని వండించాలని వంట మనిషికి సూచించారు.